దశాబ్దాల కల సాకారం

- తాళ్లూరు రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం
- సులభతరం కానున్న ప్రయాణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తాళ్లూరు రైల్వేగేటు సమీపంలో నిర్మించిన ఆర్‌యూబీ

తుని: గేటు వేస్తే చాలు ఎక్కడ వాహనాలు అక్కడే ఉండేవి. గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చేది. ప్రజలు తాళ్లూరు రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్నా కరుణించలేదు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తుని ఎమ్మెల్యే, ప్రస్తుత రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కాకినాడ ఎంపీ వంగా గీత దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఎంపీ సమస్యను రైల్వే బోర్డు దృష్టికి తీసుకువెళ్లి ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.5.15 కోట్లు మంజూరు చేశారు. గతేడాది పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులను పూర్తి చేశారు. వాహన చోదకులకు ఎండ, వానల నుంచి ఇబ్బంది లేకుండా రూఫింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అన్నీ అనుకూలిస్తే వచ్చే నెలలో ఆర్‌యుబీ ప్రారంభోత్సవం జరుగుతుందని రైల్వేశాఖ అధికారులు తెలిపారు. తుని నుంచి ప్రముఖ దేవస్థానం లోవతో పాటు రౌతులపూడి, శంఖవరం మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుకానుంది.

రోజుకు వేలాది వాహనాల రాకపోకలు

తుని రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న తాళ్లూరు రైల్వే గేటుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిషు పాలన సమయంలో రాకపోకల కోసం ఇక్కడ రేల్వే గేటు ఏర్పాటు చేశారు. వాణిజ్య కేంద్రంగా ఉన్న తునికి రావడానికి ఇది ప్రధాన మార్గం. ఈ గేటు మీదుగా రోజుకు వేల సంఖ్యలో వాహనాలు రాక పోకలు సాగిస్తాయి. తుని, రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన రైతులు ప్రతిరోజూ కూరగాయలను తుని మార్కెట్‌కు తీసుకువస్తారు. రెండు ట్రాక్‌లకు సంబంధించిన గేటు కావడంతో పది నిమిషాల వ్యవధిలో గేటు వేస్తున్నారు. వాహనాలు భారీగా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల క్రితం జాతీయ రహదారిని అనుకుని డీమార్ట్ సంస్థను ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన ప్రజలు వందల సంఖ్యలో సరకుల కోసం గేటు దాటి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. అండర్ పాస్ నిర్మాణం పూర్తి చేయడంతో రవాణా సులభతరమైంది.

వార్డులకు రవాణా సదుపాయం

పట్టణంలోని రైల్వేట్రాక్ ఆవతల ఉన్న పది వార్డుల్లో 25 వేల మంది జనాభా ఉన్నారు. వీరు ఆసుపత్రి, మార్కెట్, ప్రభుత్వ కార్యాలయాలకు రావడానికి కొండవారిపేట అండర్ పాస్‌ను వినియోగిస్తున్నారు. ఇది కొద్దిపాటి వర్షం కురిసినా నీటితో నిండిపోవడంతో అత్యవసర సమయంలోనూ అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేదు. ఎన్నో ఏళ్లుగా అండర్ పాస్‌ను విస్తరించాలని ప్రజలు విన్నపాలు చేస్తున్నారు. ఈ మేరకు రైల్వే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న అండర్ పాస్ నీరు పోవడానికి ఏర్పాటు చేసిందని, విస్తరించడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. తాళ్లూరు గేటు వద్ద నిర్మించిన ఆర్‌యూబీ మీదుగా ట్రాక్ ఆవతల నుంచి కొండవారిపేట వరకూ రోడ్డును ఏర్పాటు చేయడానికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.50 లక్షల నిధులను కేటాయించారు. దీంతో పది వార్డులకు చెందిన ప్రజలకు మేలు జరగనుంది.

మంత్రి రాజా, ఎంపీ వంగా గీత కృషితో..



తుని నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్, టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు ప్రజా ప్రతినిధులుగా పని చేశారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడమే తప్ప కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కాకినాడ ఎంపీ వంగా గీత చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. తుని ఎమ్మెల్యే, మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం ఆనందంగా ఉంది.

– ఏలూరి సుధారాణి, చైర్ పర్సన్, తుని

ప్రజలకు ఎంతో మేలు



ప్రస్తుతం రైల్వేగేటు పడితే గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఒకే సారి రెండు, మూడు రైళ్లకు గేటు వేస్తున్నారు. కూరగాయలు తుని మార్కెట్‌కు తీసుకురావడానికి ఇబ్బంది పడుతున్నాం. వచ్చే నెల నుంచి ఆర్‌యూబీ అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇకపై గేటు సమస్య ఉండదు. నేరుగా మార్కెట్‌కు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. తలుపులమ్మ లోవ, రౌతులపూడి మండలాలకు చెందిన ప్రజలకూ మేలు జరుగుతుంది.

– బోడపాటి శ్రీను, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు, తుని

క్లుప్తంగా

జి.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



జి.కొత్తపల్లి డ్రైన్‌లో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జి.కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక తీశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో మంగళవారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందించేందుకు ఒంటిమామిడిలో ఆహా రెస్టారెంట్ పక్కన ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

ఆకట్టుకొన్న రాయబారం



నాటకంలో ఒక సన్నివేశం

కాకినాడ కల్చరల్: స్థానిక ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు నాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ప్రదర్శించిన రాయబారం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కురుక్షేత్ర యుద్ధంలో తమ పక్షం వహించాల్సిందిగా కృష్ణుని కోరడానికి అర్జునుడు, దుర్యోధనుడు వచ్చిన సన్నివేశాలు ఆకట్టుకొన్నాయి. శ్రీకృష్ణుడిగా వి.రామకృష్ణ, అర్జునుడిగా డీఎస్‌పీ రావు, దుర్యోధనుడిగా అమీర్ చక్కని ప్రదర్శన చేశారు. అనంతరం ప్రదర్శించిన దుర్యోధనుని ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది.

జనసేనలో వర్గపోరు

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలోని జనసేన పార్టీలో వర్గపోరు తారా స్థాయికి చేరింది. జనసేన పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టిన జనంకోసం–జనసేన కార్యక్రమంలో వర్గపోరు బట్టబయలైంది. ఆ పార్టీ నేతలు రెండు గ్రూపులుగా విడిపోయి జనం కోసం–జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ధర్మవరంలో ఆదివారం ఉదయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న ధర్మవరంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళతామని చెప్పారు. కాగా ఆదివారం సాయంత్రం జనసేన నేత మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ) ఆధ్వర్యంలో మండలంలోని శరభవరంలో జనంకోసం జనసేన కార్యక్రమం నిర్వహించారు. దీంతో నియోజకవర్గంలో జనసేన నాయకుల మధ్య వర్గపోరు నడుస్తోందని ప్రచారం జరుగుతోంది.

అమ్మవారి జాతరలు సంస్కృతికి చిహ్నాలు

- కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే అమ్మవారి జాతరలు మన సంస్కృతికి చిహ్నాలని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ఆదివారం గొల్లప్రోలు మండలం దుర్గాడలో గరగనెత్తుకుని వేగుళ్లమ్మ అమ్మవారి జాతరను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామానికి మూల విరాట్టుగా ఉంటారన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తోందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారి గరగను శిరస్సున ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అమ్మవారి జాతర వైభవంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రత్తిపాడులో గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రత్తిపాడు: వంట గ్యాస్‌తో చెలగాటమాడరాదని, అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ జీఎమ్మార్ వరుణ్ హెచ్చరించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డులో గ్యాస్ వినియోగంపై ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎం.జి. రత్నరాజు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ ద్వారా వాటిల్లే ప్రమాదాలు, వాటిని ఎదుర్కొనే పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. గ్యాస్ వాడకం ముగిసిన వెంటనే సిలిండర్ వద్ద గ్యాస్ నిలుపుదల చేయడం, ప్రమాదం వాటిల్లిన వెంటనే స్థానికులను అప్రమత్తం చేయడం వంటి కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కేఎస్ఎన్ మూర్తి, ఫైర్‌మెన్ సతీష్ బాబు, డీఓపీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు



ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేస్తున్న ఏలేశ్వరం డిపో మేనేజర్ సత్యనారాయణ

ప్రత్తిపాడు: స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌ను ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ ఆదివారం తనిఖీ చేశారు. కాంప్లెక్స్‌లో వసతులపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. వివిధ మార్గాల్లో కాంప్లెక్స్‌కు వచ్చే, పోయే వాహనాల వివరాలను ఆరా తీశారు.

ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యల తీసుకోవాలని వినతి

ప్రత్తిపాడు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌కు వివిధ జిల్లాలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేవి. ఇపుడు రావడం లేదు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ ప్రత్తిపాడు బైపాస్ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయి. దీని వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణకు వివరించారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రత్తిపాడులో స్టాప్ ఉందని, కాగా బస్సులు మాత్రం కాంప్లెక్స్‌కు రావడం లేదన్నారు. పలాస, శ్రీకాకుళం, ఎస్ కోట, పాలకొండ, గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు కాంప్లెక్స్‌కు రాకపోగా, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని ప్రత్తిపాడు బైపాస్‌లో దింపేస్తున్నారని చెప్పారు. దీని వల్ల రాత్రి వేళల్లో బైపాస్ నుంచి గ్రామంలోకి రావడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇకపై ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ప్రత్తిపాడు బస్ కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ధరణాలకోట శ్రీను, కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులు దాసరి సత్తిబాబు, జెడ్డా బుజ్జి, మాదే మోషే తదితరులు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన గదుల సూరిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి బీసీ నాయకురాలు దేవర అనూష యాదవ్ అండగా నిలిచారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని దేవర అనూష యాదవ్ తండ్రి దేవర రమణ పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నైదాన రఘు, గొర్లు వీరబాబు, సారిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వివిధ శాఖల ప్రగతి నివేదికపై సమీక్ష, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఎస్.అన్నవరం రోడ్డులో రాకపోకలు బంద్

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం మెయిన్ రోడ్డు నుంచి తొండంగి మండలం పైడికొండ వరకూ రూ.18 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మేరకు ఎస్.అన్నవరం–పైడికొండ రోడ్డులో తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేశారు. ఎస్.అన్నవరం మీదగా పాల్తేరు, వల్లూరు, తొండంగి మండలంలో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తుని పట్టణం వీరవరపుపేట, కవలపాడు మీదుగా వెళ్లాలి. ఎస్.అన్నవరం వెళ్లే ప్రయాణికులు శేషాద్రి నగర్, లక్ష్మీదేవి చెరువు గట్టు మీదుగా గాని వెళ్లాలని అధికారులు సూచించారు.

సమాజ సేవే పరమావధి



తునిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గం

తుని: సమాజ సేవే పరమావధిగా భారత్ వికాస్ పరిషత్ పని చేస్తోందని ఆ సంస్థ రీజినల్ జాయింట్ సెక్రటరీ సంపర్క్ (సౌత్) ఎంవీ సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ మీటింగ్ హాల్‌లో ఆదివారం పరిషత్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో తుని పట్టణంలో నేషనల్ గ్రూప్ సాంగ్స్ పోటీలు, గురువందనం, వికలాంగులకు సాయం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం బీవీపీ నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. సమాజ సేవ, సంస్థ అభివృద్ధే లక్ష్యంగా నూతన కార్యవర్గ సభ్యులు అడుగులు వేయాలని సూచించారు. సంఘ నూతన అధ్యక్షుడు పమ్మి లక్ష్మణాచార్యులు మాట్లాడతూ భారత్ వికాస్ పరిషత్ అధ్యక్ష పదవి సమాజంలో ఎంతో గౌరవమైందని, ఆ పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తానన్నారు. పాయకరావుపేటలో నూతన శాఖ, ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు వీరే

సంఘ అధ్యక్షుడిగా పమ్మి లక్ష్మణాచార్యులు, కార్యదర్శిగా ఆశిన సత్యనారాయణ, కోశాధికారిగా కొమ్మోజు గౌరీశంకర్, ఉపాధ్యక్షుడిగా బీఎస్ఎస్ఏ జగదీష్, సహాయ కార్యదర్శిగా ఎన్.నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఆంజనేయ ప్రసాద్, చదరం శివాజీ, చిరంజీవి, ఆకెళ్ల శాస్త్రి, నేరెళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధుర ఫలాలు వచ్చేశాయ్



తుని మండలం చేపూరు వద్ద హైవే పక్కన ఏర్పాటు చేసిన మామిడి పండ్ల దుకాణాలు

తుని రూరల్: వేసవిలో అందరి నోళ్లను ఊరించే మధుర ఫలాలు మామిడి పండ్ల వచ్చేశాయి. ఈ సంవత్సరం మెట్ట ప్రాంతంలో పూత, పిందెలు, కాయలు రావడం ఆలస్యమైంది. ఎట్టికేలకు జాతీయ రహదారి వెంబడి మామిడి తోటలు ఉన్న రైతుల్లో కొంతమంది ఆ ప్రాంతంలోనే ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. బంగినపల్లి, సువర్ణరేఖ వంటి తెలికపాటి రకాల మామిడి పండ్లను కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచారు. డజను ధర రూ.300 నుంచి రూ.500 వరకూ విక్రయిస్తున్నారు. పక్వానికి వచ్చిన మామిడి పండ్లనే కొనుగోలు చేయాలని, రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను తినడం ప్రమాదకరమని ఉద్యానశాఖ అధికారి జి.విజయలక్ష్మి వినియోగదారులకు సూచించారు.

400 మందికి వైద్య పరీక్షలు



జె.కొత్తూరు వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది




జె.అన్నవరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రద్ధ

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తదేకం ఫౌండేషన్, జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. జగ్గంపేటకు చెందిన రామచంద్ర హాస్పటల్ వైద్యులు 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ మండల కార్యదర్శి బద్ది సురేష్, గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు, తదేకం ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ బీడీల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన అంజూ ఇంటర్నేషనల్ ఐకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శ్రద్ధ గ్రామానికి చెందిన 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 25 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. అంజూ ఇంటర్నేషనల్ ఐకేర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



ఏలేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏలేశ్వరం 12వ వార్డులో వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. లింగంపర్తిలో పార్టీ నాయకులు అడపా పార్థసారథి, చిక్కాల లక్ష్మణరావు, యర్రవరంలో నీరుకొండ సత్యనారాయణ, బీశెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు.

ముమ్మరంగా మాసూళ్లు

- పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీ
- కూలీల కొరతతో ఇక్కట్లు



సిరిపురంలో మెషీన్‌తో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా రబీ వరి మాసూళ్లు జోరుగా సాగుతున్నాయి. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో 21 వేల ఎకరాల్లో రైతులు దాళ్వా వరి సాగు చేశారు. వీటిలో దాదాపు 50 శాతం వరకూ మాసూళ్లు పూర్తికావస్తున్నాయి. ఏలేశ్వరం మండలంలో 4800 ఎకరాల్లో దాళ్వా వేయగా పంట కోతకు రావడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. రైతులు ఎక్కువగా చెరువులు, బోర్లపై ఆధారపడి సాగు చేసే ఆర్‌జీఎల్, 1156, 1121 రకాలు వేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సిరిపురం, తిరుమాలి తదితర గ్రామాల్లో రైతులు మెషీన్లతో కోత కోయిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2200, 75 కేజీల బస్తాకు రూ.1530 చొప్పున మద్దతు ధర నిర్ణయించింది.

యంత్రాలతో కోతలు

రైతులు దాళ్వా కోతలకు యంత్రాలపై ఆధారపడుతున్నారు. మెషీన్లతో కోస్తే కోత, నూర్పుడి అయిపోయి గింజలు చేతికి వచ్చేస్తున్నారు. దీంతో పాటు ఖర్చు కూడా తక్కువగా ఉండడంతో రైతులు వాటి వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో ఈప్రాంత రైతులు ఎక్కువగా కూలీలతోనే కోతలు కోయించేవారు. ప్రస్తుతం కూలి రేట్లు పెరగడం, కూలీల కొరత కారణంగా మెషీన్లతో కోతలు కోయిస్తున్నారు. దాళ్వా వరి పంట ఒబ్బిడి చేసిన రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

ముమ్మరంగా రబీ వరి కోతలు

తొండంగి: మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా వ్యవసాయబోర్లు, పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో 12 వేల ఎకరాలకు పైగా వరిసాగు చేసారు. వ్యవసాయబోర్లు పరిధిలో ముందుగా నాట్లు వేయడంతో ఇప్పటికే వరికోతలు పూర్తయ్యాయి. పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రబీ వరి పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. రైతులు సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని ఏఓ ఎస్.నరసింహం తెలిపారు.



లింగంపర్తిలో పొలాల్లో కోసిన వరిపనలు

అపరాల సాగు చేపట్టాలి



వరికోతల అనంతరం తేమపోకుండా రైతులు అపరాల సాగు చేపట్టాలి. అపరాల సాగుతో రైతులు మేలు జరుగుతుంది. ప్రస్తుతం ఆర్‌బీకేల్లో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

– జ్యోతి, వ్యవసాయ శాఖాధికారి, ఏలేశ్వరం మండలం

అధ్వానంగా పంట కాలువ



కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి శ్రీనివాసనగర్‌లో కుమార్‌స్వామి ఆలయం వద్ద సింహాద్రిరాజు పంట కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. చెత్తాచెదారం, వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో తూము కానుల వద్ద పెంటకుప్ప ఏర్పడింది. దీంతో పంట కాలువ నుంచి నీరు ముందుకు పారడం లేదు. ఈ పంట కాలువ ద్వారా సుమారు 3500 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. వ్యర్థాలతో కాలువ నిండిపోయి శివారు పొలాలకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంభంధిత అధికారులు స్పందించి కానుల వద్ద పేరుకుపోయిన పెంట కుప్పలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చిల్లంగి సింహాద్రిరాజు పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు